www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 7 నవంబర్ 2025
5
అన్నమయ్య

ముస్లిం ఐక్యవేదిక గౌరవ సలహాదారుడిగా బాషా

ఎస్.కె.బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముస్లిం ఐక్యవేదిక అన్నమయ్య, కడప జిల్లాల గౌరవ సలహాదారుగా మదనపల్లెకు చెందిన డాక్టర్ ఎస్.కె.బాషాను ఎంపికయ్యారు. గురువారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ముస్లిం ఐక్య వేదిక అన్నమయ్య, కడప జిల్లాల గౌరవ సలహాదారులుగా అవకాశం ఇవ్వడంపై రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాఫర్ వలి, అబ్దుల్ రహమాన్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఖలీల్ సయ్యద్, అన్నమయ్య, కడప జిల్లాల అధ్యక్షులు మాసుమ్ వలి, ఖాజా, కార్మిక విభాగం అధ్యక్షులు ఇమామ్ బాషాలకు కృతజ్ఞతలు తెలిపారు. జాతిని ఐక్యం చేయడానికి, విద్య, వైద్యం, రాజకీయ, సామజిక రంగాల్లో ముస్లిం సోదరులను చైతన్యపరిచి ముందుకు నడిపించేందుకు కృషి చేస్తానన్నారు.

జెఎల్ సీనియారిటీలో గూడుపుఠాణి

- గురుకుల ప్రిన్సిపళ్లతో డిసిఒ కుమ్మక్కు?
- ఇష్టారాజ్యంగా సీనియారిటీ గుర్తింపు
- సీనియర్ల స్థానంలో జూనియర్లు
- డిసిఒ చుట్టూ సీనియర్ జెఎల్స్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల కాంట్రాక్టు జూనియర్ లెక్షరర్ల సీనియారిటీ గుర్తింపులో గూడుపుఠాణి నడుస్తోంది. ప్రభుత్వం ఇటీవల కాంట్రాక్టు జూనియర్ లెక్షరర్ల సీనియారిటీని గుర్తించాలని ఆదేశాలు జారీ చేసింది. గురుకుల పాఠశాలల ఉమ్మడి కడప జిల్లా కో-ఆర్డినేటర్ కడప, అన్నమయ్య జిల్లా పరిధిలోని 24 గురుకుల పాఠశాలల పరిధిలోని జూనియర్ లెక్షరర్ల సీనియారిటీ గుర్తింపు ప్రక్రియను చేపట్టింది. కొంత మంది గురుకుల పాఠశాలల ప్రిన్సిపళ్లతో కమిటీని ఏర్పాటు చేసింది. ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపళ్ల ద్వారా జూనియర్ లెక్షరర్ల సీనియారిటీ వివరాలను సేకరించింది. పులివెందుల గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ సీనియర్ లెక్షరర్ ఉన్నప్పటికీ జాబితాలో చూపించకుండా జూనియర్ వెనకేసుకుని రావడం, పిఎస్ సబ్జెక్టును బోధించాలని ఆదేశించడం వెనుక మతలబేమిటో తెలియడం లేదు. జెఎల్ సీనియారిటీ గుర్తింపులో అవకతవకలు ఉన్నాయని డిసిఒకు స్పష్టంగా తెలిసినప్పటికీ మిన్నకుండిపోవడం వెనక కుమ్మక్కు రాజకీయం నడుస్తోందనే విమర్శలు ఉన్నాయి. లక్కిరెడ్డిపల్లి గురుకుల ప్రిన్సిపల్ సీనియర్ జెఎల్‌కు ప్రాధాన్యత ఇవ్వగా, పులివెందుల ఇప్పెంట్ల గురుకుల ప్రిన్సిపల్‌తో కలిసి సీనియారిటీని నిర్లక్ష్యం చేయడం ఏమిటనే వాదన వినిపిస్తోంది. అన్నమయ్య జిల్లా నందలూరు మండలం ఆడపూరులోని గురుకులంలో గణిత జూనియర్ లెక్షరర్ కొరత కారణంగా ప్రిన్సిపల్ గణిత సబ్జెక్టు బోధన, అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలను చూసుకోవాల్సి వస్తోంది. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఓ జెఎల్‌ను బద్వేల్‌కు బదిలీ చేయడం వెనుక తన, పర అనే పక్షపాతం చూపారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం పదవ తరగతి, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ సైతం విడుదల చేసిన నేపథ్యంలో గురుకుల పాఠశాలల్లో సీనియారిటీ ఆధారంగా జెఎల్ పోస్టింగ్స్ ఇచ్చి మెరుగైన ఫలితాలు సాధించాల్సిన సమయంలో సీనియారిటీ లొల్లితో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవడం ఏమిటో తెలియడం లేదనే విమర్శలు ఉన్నాయి. కలెక్టర్ జోక్యం చేసుకుని సీనియారిటీ గుర్తింపులో దొర్లిన అవకతవకలను సరిదిద్ది వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందనే వాదన వినిపిస్తోంది.

సీనియారిటీ ఇబ్బందులు వాస్తవమే

జూనియర్ లెక్షరర్ సీనియారిటీ లిస్టు ప్రక్రియను పూర్తి చేశాం. నాలుగు, ఐదు చోట్ల సీనియారిటీ ఆధారంగా భర్తీ చేయడంలో ఇబ్బందులు ఉన్నాయి. పార్ట్‌టైమ్ టీచర్లను సైతం రిక్రూట్ చేశాం

- ఉదయశ్రీ, బి.ఆర్.గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్, కడప.

సీనియర్ జెఎల్‌ల తరుపున ఉద్యమిస్తాం

జెఎల్ సీనియారిటీ గుర్తింపులో అన్యాయం చేస్తే ఉద్యమిస్తాం. సీనియర్ అధ్యాపకుల స్థానంలో జూని యర్ అధ్యాపకులను ఉంచడం తగదు. గణితం బోధించే జెఎల్‌కు పిఎస్‌ను బోధించాలని ఆదేశించడం సరికాదు. దీని ప్రభావం వార్షిక ఫలితాలపై పడే ప్రమాదం ఉంది.

- వి.రవి, ఎస్‌ఎఫ్‌ఐ కడప జిల్లా కార్యదర్శి, కడప.

నేడు కడపకు శ్రీచరణి

- నగరంలో ర్యాలీ, ఎసిఎ స్టేడియంలో ఘన సత్కారం

ప్రజాశక్తి-కడప

క్రికెట్‌లో సత్తాచాటి కడప ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో నిలబెట్టిన మన ముద్దుబిడ్డ శ్రీచరణి ఈ నెల 7న కడపకు రానున్నారు. ప్రపంచ క్రికెట్ కప్‌లో క్రీడా అణిముత్యంగా నిలిచిన ఆమెకు ఘనస్వాగతం పలికేందుకు ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్ సౌజన్యంతో కడప జిల్లా క్రికెట్ అసోషియేషన్ భారీ ఏర్పాట్లు చేసింది. కడప నగరమంతా విజయోత్సాహంలో ఉన్న శ్రీచరణి పోస్టర్లు వెలిశాయి. కడప గడపలో శిక్షణ పొంది ఐదేళ్ల కాలంలోనే భారత జట్టులో స్థానం సంపాదించేందుకు తెరవెనుక కృషి చేసిన కడప జిల్లా క్రికెట్ అసోషియేషన్, ఆంధ్ర క్రికెట్ ఆసోషియేషన్ అంతే బాధ్యతగా ఘనంగా సత్కరించుకోనున్నారు. సాయంత్రం 4.30 గంటల నుంచి హెడ్ పోస్టాఫీసు, ఏడు రోడ్లు, ఎన్‌టిఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్, రాజీవ్‌మార్గ్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించేందుకు సన్నహాలు పూర్తయ్యాయి. అనంతరం ఎసిఎ స్టేడియంలో సాయంత్రం 6.30 గంటలకు ఘనంగా సత్కరించనున్నారు. జిల్లా ఖ్యాతి ప్రపంచ స్థాయిలో నిలబెట్టిన శ్రీచరణితో క్రికెట్ అసోషియేషన్‌కు ఉన్న అనుబంధాన్ని పంచుకోనున్నారు. కార్యక్రమంలో కడప నగరానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు. శ్రీచరణికి జిల్లా క్రీడాభిమానులు ఘనస్వాగతం పలికి కార్యక్రమం విజయవంతం చేయాల్సిందిగా క్రికెట్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.భరత్‌రెడ్డి, ఎ.రెడ్డిప్రసాద్ కోరారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఒంగోలులో ఈ నెల 15, 16వ తేదీల్లో నిర్వహించనున్న ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, సిఐటియు జిల్లా డిప్యూటీ సెక్రటరీ రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ సమస్యల మీద ప్రతి ఏడాది రాజీ పడకుండా ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పోరాటాలు చేస్తోందని తెలిపారు. రూ.3 వేల నుండి రూ.21వేలు వేతనం వరకూ యూనియన్ అండతోనే పోరాటాలు చేసి సాధించుకున్నామని పేర్కొన్నారు. మట్టి ఖర్చులు వస్తున్నాయని, స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వర్కర్స్‌కి ఇంజినీరింగ్ విభాగం వారికి రూ.3,500 వేతనం పెరిగిందంటే కారణం యూనియన్ నిరవధిక పోరాటాలే కారణమన్నారు. రెగ్యులర్ చేస్తామన్న పాలకుల హామీల కోసం, హక్కుల సాధన కోసం, సమాన పనికి సమాన వేతనం పొందాలంటే మరో పోరాటానికి యూనియన్ ఆధ్వర్యంలో నాంది పలకాలని తెలిపారు. ప్రభుత్వం కొత్తగా పని గంటలు పెంచి కార్మికులకు కష్టాలు పెంచుతున్నదని, ఈ నేపథ్యంలో మహాసభలో మున్సిపల్ వర్కర్స్ ఎదుర్కొనే స్థానిక జిల్లా సమస్యలను చర్చించి రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టడానికి, పాలకుల మీద ఒత్తిడి తేవడానికి దీర్ఘకాలిక ప్రణాళిక తయారు చేస్తారని తెలిపారు. జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లి, బి.కొత్తకోట మున్సిపల్ వర్కర్స్ సకాలంలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.గంగయ్య, బి.కొత్తకోట బి.గోపాల్, ఎం.శ్రీరాములు, శ్రీనాథ్, మున్సిపల్ యూనియన్ జిల్లా డిప్యూటీ సెక్రటరీ జి.రాజు, ఎం.కృష్ణప్ప, గుర్రాల వెంకటరమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

- రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి

కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో రెడ్ క్రాస్ సభ్యులు

ప్రజాశక్తి - రాయచోటి

పర్యావరణ పరిరక్షణు పాటుపడుదామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనమయ్య జిల్లా శాఖ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లో ఉన్న రెడ్ క్రాస్ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అన్నమయ్య జిల్లా శాఖ మొదటి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో త్వరలో రక్త నిధిని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. సభ్యులు తమ ప్రాంతాలలో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రెడ్ క్రాస్ సభ్యులందరూ సహాయ కార్యక్రమాల్లో పాల్గొనేలా శిక్ష ఇస్తామని చెప్పారు. సామాజిక సేవ చేయాలనే ప్రతి ఒక్కరూ రెడ్ క్రాస్ సభ్యత్వాన్ని తీసుకోవాలన్నారు. సభ్యులందరూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా చేపట్టాలన్నారు. 'కరుణ, నిబద్ధతతో మానవ సేవ"అనే రెడ్ క్రాస్ ధ్యేయాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అందరి సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అన్నమయ్య జిల్లా శాఖను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్‌ఒ మధుసూదన్ రావును గౌరవ సూచికంగా కలిసి రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవల గురించి వారికి తెలియజేశారు. అనంతరం వారికి పుష్ప గుచ్ఛమిచ్చి శాలువులతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా షరీఫ్, ట్రెజరర్ వేణుగోపాల్, సభ్యులు మడితాటి నరసింహారెడ్డి, డాక్టర్ మహేశ్వర రాజు, డాక్టర్ సుధాకర్ రెడ్డి, డి.ఆర్ జగదీష్, ఐపిఎల్ క్రికెట్ ప్లేయర్ హరి శంకర్, అంతర్జాతీయ ఫెన్సింగ్ ఛాంపియన్ కుమారి బేబీ పాల్గొన్నారు.

అవినీతికి సహకరించడం నేరం : ఎపిజిబి జిఎం

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సుశాంత్ కుమార్

ప్రజాశక్తి-రాజంపేట

అవినీతికి సహకరించడం, భాగస్వామి కావడం చట్టరీత్యా నేరమని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (ఎపిజిబి) రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్ స్వారో అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రాజంపేట ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు మన్నూరు హైస్కూల్‌లో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒ సుబ్బరాయుడు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుశాంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండే విజిలెన్స్ మీద అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజ హిత కార్యక్రమాలకు ఎపిజిబి ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. అందరి ప్రగతి కోరే బ్యాంకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అని తెలియజేశారు. క్విజ్ పోటీలలో ప్రథమ బహుమతి మన్నూరు హైస్కూలు గెలుచుకోగా ద్వితీయ బహుమతి బోయినపల్లి పాఠశాల సాధించింది. తృతీయ బహుమతి రాజంపేట జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల గెలుచుకుంది. గెలుపొందిన విజేతలకు బహుమతులు రీజనల్ మేనేజర్, ఎంఇఒ, ప్రధానోపాధ్యాయులు కె.పరిమళ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సీనియర్ మేనేజర్లు కె.నాగేశ్వర, నవనీశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు సుబ్బారావు

ఎస్‌టి వర్గీకరణ చేపట్టాలి

ప్రజాశక్తి-రాజంపేట: వెనుకబడిన యానాదులకు ఎస్‌పి వర్గీకరణ తరహాలో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించడంతో పాటు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యానాదుల ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చేవూరి సుబ్బారావు అన్నారు. గురువారం రాజంపేట కొండ తూర్పు యానాది కాలనీలో నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజన తెగల్లో అధిక జనాభా కలిగిన యానాదులు నేటికీ వెనుకబడి ఉన్నారని తెలిపారు. సామాజిక న్యాయం దిశగా ముందుకు వెళ్తున్న కూటమి ప్రభుత్వం ఎస్‌టి వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. యానాదుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు 35 మంది ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా వెలుగు సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ యానాది గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా చైర్మన్‌గా మేకల రమణయ్య, జిల్లా గౌరవ అధ్యక్షులుగా నిమ్మల వెంకట రమణ, జిల్లా కోశాధికారిగా తలపల మధుసూదన్‌రావు, ఉపాధ్యక్షులుగా యాకసరి హరినాథ్, యాటగిరి సుబ్బారాయుడు, చౌటూరు మనోజ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా మల్లికా వెంకటరమణ, యానాదుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నీలం అంకమ్మ, జిల్లా మహిళా అధ్యక్షులుగా యల్లంపల్లి అంకమ్మ, మహిళా ఉపాధ్యక్షులుగా కానూరు రుక్మిణమ్మ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జలకం శివయ్య, కోశాధికారిగా శ్రీకుల బాలాజీ, కడప జిల్లా అధ్యక్షులుగా నీలం సురేంద్ర, యానాదులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-పీలేరు: పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం చాలా అవసరమని పీలేరు విఎస్ఎన్, ఎస్‌విఎస్ఎన్ విద్యా సంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి తెలిపారు. కార్తీక వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎఫ్ఆర్ఒ జయప్రసాదరావు ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఎస్‌విఎస్ఎన్ పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం కారణంగా అతివృష్టి, అనావృష్టి సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితులు ప్రజల జీవన విధానాలపై ప్రతికూల ప్రభావాలు చూపుతున్నాయని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంచుతూ మొక్కల నాటే, పెంచే కార్యక్రమాలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో విఎస్ఎన్ స్కూల్ ఉపాధ్యాయురాలు రమాదేవి, పీలేరు సెక్షన్ అధికారి సబియా సుల్తానా, బీటు అధికారులు చంద్రకళ, శ్రీనివాసన్, రెడ్డి ఆసియాబీ, జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి

మొంథా తుపాన్‌తో ఉమ్మడి కడప జిల్లాలో నష్టపోయిన రైతులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని గురువారం పిసిసి అధ్యక్షులు షర్మిలకు ఆంధ్రప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దుగ్గనపల్లి సురేంద్రారెడ్డి, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కామన ప్రభాకరరావు, వివిధ జిల్లాల చైర్మన్లతో కలసి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్ర రత్నభవన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తుపాన్ కారణంగా నష్టపోయిన పంటలను పరిశీలించి, అంచనా వేసి రైతులను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో రాజంపేట ప్రాంతంలో వరి, పులివెందులలో చీనీ, మైదుకూరులో ఉల్లి పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంట చేతికందేలోపే తుపాన్‌తో నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దఎత్తున దెబ్బతిన్న పంటలతో రైతులకు న్యాయం చేయాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కడప జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు చిన్న రామిరెడ్డి పాల్గొన్నారు.

23న భగవద్గీత కంఠస్థ పోటీలు

ప్రజాశక్తి- రాజంపేట: గీతా జయంతిని పురస్కరించుకొని ఈ నెల 23వ తేదీన పట్టణంలోని మన్నూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సంగరాజు శారద ఆధ్వర్యంలో టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్తు జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ డాక్టర్ టి.గోపి బాబు, ధర్మాచార్యులు వెంకటరమణ, ప్రముఖ ఆధ్యాత్మికోపన్యాసకులు కాకర్ల రాముడు గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6-9 తరగతి లోపు విద్యార్థులు 14వ అధ్యాయం గుణత్రయ విభాగయోగం, 10, 11, 12 తరగతుల విద్యార్థులు 16వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగయోగం శ్లోకాలను కంఠస్థం చేసి చెప్పాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 20వ తేదీ లోపల నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ధర్మరాజు, మల్లెల హైమావతి, చెన్నూరు ఆదిలక్ష్మి, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సహకార గృహ నిర్మాణ సంఘం పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

సంఘం అభివృద్ధికి బాటలు వేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: మదనపల్లె సహకార గృహ నిర్మాణ సంఘం అభివృద్ధికి బాటలు వేయాలని నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. గురువారం టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ ఛాంబర్‌లో అధ్యక్షుడు ఎస్.రెడ్డి షంషీర్, ఉపాధ్యక్షుడు ఎన్.రెడ్డెప్ప, కార్యదర్శి బి.మహేష్ కుమార్, సభ్యులు చల్లా చలపతి, శివానందర్ నాయక్, నరేష్, శివాజీ తదితరులను ఎమ్మెల్యే, నాదెళ్ల విద్యాసాగర్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార గృహ నిర్మాణ సంఘం ఓ గుర్తింపు కలిగిన సంస్థ అని, పట్టణంలో గృహ నిర్మాణాలకు రుణాలను మంజూరు చేయడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సంఘానికి నూతనంగా ఎంపికైన కమిటీ అదుతేంగా పనిచేస్తుందని కితాబిచ్చారు. అనంతరం రెడ్డి షంషీర్ మాట్లాడుతూ సహకార గృహనిర్మాణ సంఘం అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి సహకార గృహ నిర్మాణ సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. తనకు అన్నివిధాల సహకరిస్తున్న టిడిపి నాయకులు, మిత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ మహర్షి భాస్కర్, డైరెక్టర్లు రవికాంత్, జోళపాలెం దేవేంద్ర, పసుపు రవి, సోము, న్యాయవాది గణపతి, నాయకులు రాగినేని రఘుపతి నాయుడు, బాలుస్వామి, జయరాం యాదవ్, జీవి నాయుడు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిని సత్కరించిన మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట

వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికైన చొప్పా ఎల్లారెడ్డిని వైసిపి రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి జాహిద్ అలి ఆధ్వర్యంలో గురువారం అన్నమాచార్య కళాశాలలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మైనార్టీ పట్టణ అధ్యక్షులు మసూద్ అలీఖాన్, నియోజకవర్గ అధ్యక్షులు ఖాజామొహిద్దీన్, మునిసిపల్ వైస్ చైర్మన్ మునాఫ్, సత్తార్, మజీద్, అక్తర్, నాసిర్, ఏజాజ్, షాకీర్, ఇర్ఫాన్, అజీజ్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం : 'చింతల'

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను దగా చేస్తోందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో జరిగిన వైసిపి మండల స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి పాలకులు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ, వైసిపి శ్రేణులను వేధింపులు, తప్పుడు కేసులతో అక్రమ అరెస్టులతో పాలన సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని వేధింపులకు గురిచేయడంలో చూపుతున్న శ్రద్ధను ప్రజా సంక్షేమంపై చూపడం లేదని మండిపడ్డారు. లిక్కర్ కుంభకోణంలో ఏ ఒక్క ఆధారం చూపలేకపోయినప్పటికీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అక్రమంగా నిర్బంధించి వేధించారని, కూటమి ప్రభుత్వ పెద్దల అండదండలతో ములకలచెరువులో తంబళ్లపల్లె టిడిపి అభ్యర్థి జయచంద్రారెడ్డి కల్తీ మద్యాన్ని తయారు చేసి తెలుగు రాష్ట్రాలతోపాటు, పొరుగు రాష్ట్రాల్లోనూ సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రైతులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలం వెళ్లదీస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే వైసిపి పాలనలో అప్పటి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెచ్చిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేసి పేదలు, గ్రామీణ ప్రజల పిల్లలకు వైద్య విద్యను కూటమి ప్రభుత్వం దూరం చేస్తూ దగా చేస్తోందన్నారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ చర్యల పట్ల ప్రజా సంఘాలు, ప్రజలు కూడా తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారని, వైసిపి రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టి ఉద్యమాన్ని సాగిస్తోందన్నారు. సమావేశంలో నాయకులు చింతల శివానందరెడ్డి, పులి శివారెడ్డి, నీళ్ల భాస్కర్, బిడ్డల కేశవరెడ్డి, అబ్దుల్ కలీమ్, నిర్ధాల శ్రీధర్ రాయల్, నరసింహులు, కిరణ్ కుమార్, కువైట్ ఇబ్రహీం, మహబూబ్ బాషా, అశోక్ కుమార్ రెడ్డి, సురేష్ కుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, రమేష్, రాజబాబు, రఘు, చికెన్ మస్తాన్, సైపుల్లా, టైలర్ బాష, రాయుడు పాల్గొన్నారు.

చేపల చెరువులకు వేలం పాట నిర్వహిస్తున్న డిఎల్‌పిఒ, ఎంపిడిఒ

రెడ్డివారిపల్లి పంచాయతీకి రూ.64 వేల ఆదాయం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల పరిధిలో రెడ్డివారిపల్లి పంచాయతీని ఐదు చెరువులకు చేపల ఫల సాయానికై బహిరంగ వేలం పాటను గురువారం సర్పంచ్ ఎన్. రెడ్డమ్మ నరేంద్రరెడ్డి అధ్యక్షతన, డిఎల్‌పిఒ నాగరాజా, ఎంపిడిఒ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలంపాట ద్వారా పంచాయతీకి రూ.64,500లు ఆదాయం సమకూరినట్లు పంచాయతీ కార్యదర్శి గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పంచాయతీలోని చెరువులకు నీరు చేరడంతో, చేపల ఫలసాయానికై ప్రభుత్వం బహిరంగ వేలం పాటను నిర్వహించిం దన్నారు. ఇందులో సీతాపతి చెరువును బి.హరి రూ.25వేలకు, వీరప్పనాయుని చెరువును చెన్నకేశవులు రూ.22 వేలకు, బోడికొండరాయుని చెరువును వెంకటరమణాచారి రూ.12 వేలకు, దాసరివానికుంటను రూ.3వేలకు, మోరపుకుంటను రూ.25 00లకు దక్కించుకున్నారు. చేపల చెరువుల వేలం ద్వారా రూ.64,500లు పంచాయతీకి ఆదాయం సమకూరిందన్నారు. ఈ ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ఉపయోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాయత్రి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-కలకడ : మండలంలోని పోలీస్ స్టేషన్లను డిఎల్‌డిఒ అమరనాథరెడ్డి పరిశీలించారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రమైన కలకడ ప్రాథమిక పాఠశాలలు తెలుగు, ఉర్దూ, బాటవారిపల్లి జడ్‌పి హైస్కూల్, ఎంపిడిఒ కార్యాలయాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఉన్నయా లేదా అని ఆరా తీశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 12వేల మంది ఓటర్లు ఉన్న యెడల వాటిని రేషినే లెజేషన్ చేయడం జరుగుతుందన్నారు. పోలింగ్ స్టేషన్లలో గాలి, వెలుతురు ఉండి, ఓటర్లకు అనుకూలంగా ఉన్నవా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ భానుప్రసాద్, విఆర్ఒ షాజహాన్, కంప్యూటర్ ఆపరేటర్ షాకీర్‌బాష పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి 'కట్టా' ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట : కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ బెంగళూరులోని రెయిన్‌బో ఆసుపత్రిలో అయాం చికిత్స కోసం టిడిపి సీనియర్ నాయకుడు కట్టా దొరస్వామినాయుడు చేయూతనిచ్చారు. బాలుడి చికిత్స నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాలుడికి వైద్యఖర్చులు భరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సిఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందిస్తామని తెలిపారు. నాయకులు సైతం చేతనైనంత సాయం చేసి బాలుడిని ఆదుకోవాలని అధిష్టానం తెలిపిందన్నారు. త్వరలో బాలుడు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు నాగిరెడ్డిపల్లె విద్యార్థులు

ప్రజాశక్తి - నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పెద్దరామయ్యగారి లక్ష్మీదేవి, సయ్యద్ ఉమర్‌ఉస్మాన్‌అలీ రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు గౌరీలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కడపలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా పోటీలలో లక్ష్మీదేవి డిస్కస్ త్రో విభాగంలోనూ, ఉమర్ ఉస్మాన్ అలీ షాట్ పుట్ విభాగంలోనూ మంచి ప్రతిభతో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పేర్కొ న్నారు. గురువారం జిల్లాలో ఎంపికైన క్రీడాకారులందరితో పాటు వీరు శ్రీకాకుళంలో జరిగే పోటీలకు బయలుదేరుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఇరు వురు విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు గౌరీని పాఠశాల ప్రధానో పాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ అభినందించారు. విద్యార్థులకు ప్రోత్సా హకాలుగా కానుకలను అందించారు. కార్య క్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి ప్రియ, గీత, మస్తాన్, ఆర్‌వి.రమణమ్మ, రాజేంద్ర, గొంటుముక్కల వెంకట రమణ, సురేష్, సంపత్, పవన్‌కుమార్, గాయత్రీదేవి, హుస్సేన్ పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే అభివృద్ధి

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్ : అభివృద్ధి అంటే మాటల్లో కాకుండా చేతలలో చూపించిన నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి అని వైసిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయభాస్కర్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆర్‌టిసి బస్టాండ్, వంద పడకల ఆస్పత్రి అభివృద్ధి పనులు, రాయచోటి పట్టణాన్ని గ్రేడ్ 3 నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీని చేయించడం, రైతుబజార్, ఎంపిడిఒ కార్యాలయ భవనాలు, మున్సిపల్ పార్కు నిర్మాణం, రాయచోటిని జిల్లా కేంద్రం చేయడం తదితర అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పారు. ఇదే సమయంలో రాయచోటిని విద్యాహబ్‌గా మార్చిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. కూటమి నాయకులు రాయచోటిలో అభివృద్ధి జరగలేదని విమర్శించడం దారుణమన్నారు. రాయచోటి వీధుల్లో తిరిగితేనే అభివృద్ధి ఎలా జరిగిందో తెలుస్తుందన్నారు. మంత్రి మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటినిమరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. రాజంపేటకు జిల్లా కేంద్రం తరలి పోతుందని జోరుగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో జిల్లా కేంద్రం రాయచోటినీ కాపాడాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి శివయ్య, రాష్ట్ర వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ కార్యదర్శి రేపల్లె సంజీవ, శివశంకర్ యాదవ్ పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక నాణ్యత : డిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్: ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక నాణ్యత గల ఉత్పత్తులు సాధ్యమవుతాయని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ అన్నారు. రాయచోటిలోని జిల్లా ప్రకృతి వ్యవసాయం కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ట్రైనింగ్ ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థా యిలో ప్రకృతి వ్యవసాయ సూత్రాలను రైతులకు చేర్చడంలో టిఐసిఆర్‌పిలు కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి సారాన్ని కాపాడడం, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం ఎలా సాధ్యమైతాయో వివరించారు. అనంతరం ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. చెన్నకృష్ణమ్మ పొలంలో గ్రాండ్ మోడల్, ఎటిఎం మోడల్, పిఎండిఎస్ ఎండిఎస్ నమూనాలను పరిశీలించారు.ద్రవ జీవామృతం, ఘనజీవామృతం, సీడ్ ఫిల్లైజేషన్ తయారీ విధానం, ప్రయోజనాలు, వాటి ప్రభావం గురించి డెమో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని ప్రకృతి వ్యవసాయం మండల స్థాయి సిబ్బంది, టిఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో ఘనంగా ఓరియంటేషన్

ప్రజాశక్తి-రాజంపేట

అన్నమాచార్య యూనివర్సిటీలో గురువారం 2025-26 విద్యా సంవత్సరానికి బి.టెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టాలీవుడ్ నటుడు, ప్రసిద్ధ మోటివేషనల్ స్పీకర్ కె.వి.ప్రదీప్ ప్రధాన అతిథిగా విచ్చేశారు. కార్యక్రమానికి యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ సి.గంగిరెడ్డి, విసి డాక్టర్ సాయిబాబారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్. మల్లికార్జునరావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, అడ్మిషన్స్ డీన్ డాక్టర్ బి. జయరామి రెడ్డి, అన్నమాచార్య ట్రస్ట్ వైస్ చైర్మన్ సి. ఎల్లారెడ్డి వేదికపై పాల్గొన్నారు. ఈసందర్భంగా కె.వి. ప్రదీప్ మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించాలంటే ముందుగా మనమీద నమ్మకం కలిగి ఉండాలని, మీరు ఎక్కడి నుంచి వచ్చారన్నది కాదు, ఎక్కడికి చేరాలనుకుంటున్నారన్నదే ముఖ్యమన్నారు. ప్రతి రోజు ఒక కొత్త అవకాశం ఉంటుందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమశిక్షణ, కష్టపడి పనిచేయడం, సానుకూల దృక్పథం విజయానికి మూలమన్నారు.ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా డాక్టర్ ఎం. సుబ్బారావు వ్యవహరించారు.కార్యక్రమంలో డీన్స్, విభాగాధిపతులు, ఫ్యాకల్టీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఎన్‌టిఆర్ వైద్య సేవలు అర్హులందరికీ అందాలి

- డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ఆంజనేయులు

ప్రజాశక్తి కలికిరి

ఎన్‌టిఆర్ సేవలు అర్హులందరికీ అందించాలని డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులు సిహెచ్‌సి వైద్యాధికారులకు సూచించారు. గురువారం ఆయన కలికిరి సిహెచ్‌సిని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఒపి, ఐపి, డెలివరీలు, ఇహెచ్ఆర్, ఎన్‌టిఆర్ వైద్యసేవ, అభ, ఎఫ్ఆర్ఎస్ ల్యాబ్, ఫార్మసీ,లేబర్‌రూమ్, ఆపరేషన్ థియేటర్, డైట్ రికార్డులను తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్, వైద్యసేవలను మెరుగుపరచాలని ఆదేశించారు. శానిటేషన్ సిబ్బందికి జీతాలు రాలేదని అడుగగా వెంటనే కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరగా జీతాలు జమ అయ్యేటట్లు కృషి చేస్తానని తెలిపారు.కొత్త భవనంలో మాత శిశు వైద్య సేవలు, ఎక్స్‌రే, ల్యాబ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పాత భవనం రెనోవేషన్‌లో ఉండటం వల్ల తాత్కాలికంగా ఒపి, ఐపి సేవలు కొత్త భవనంలో కొనసాగిస్తున్నామని ప్రజలు సహకరించాలని కోరారు. పాము కాటుకు, కుక్క కాటుకు సంబంధించన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హార్ట్ ఎటాక్‌కి సంబంధించిన నలభై వేలు విలువ చేసే టెనెక్టప్లేస్ ఇంజెక్షన్ అందుబాటులో ఉందని గుండె నొప్పి వచ్చినప్పుడు ఇసిజి తీసుకొని అవసరమైతే వైద్యులు ఆ ఇంజెక్షన్

ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ఆంజనేయులు

ఇస్తారని, ఈ సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వై.పవన్‌కుమార్, డాక్టర్ ఉదయకిరణ్, డాక్టర్ ఆశాలత, డాక్టర్ సిమ్రన్, ఇంచార్జ్ హెడ్ సిస్టర్ వనజమ్మ, ఫార్మసిస్ట్ మొయినుద్దీన్, రేడియోగ్రాఫర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు భవిష్యత్తుకు పునాదిరాళ్లు : డివైఇఒ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ భానుప్రసాద్

ప్రజాశక్తి-కలకడ

గ్రంథాలయాలు భవిష్యత్తుకు పునాదిరాళ్లని డివైఇఒ లోకేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని బాటవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యులు టిడిపి సీనియర్ నాయకులు దగ్గుపాటి వెంకటేశ్వరరావు, కెఎస్ఎస్ ప్రసాద్, బరకం శ్రీనివాసులురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి వంటి దాతల సహకారంతో స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో గ్రంథాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గ్రంథాలయాలు భవిష్యత్తుకు ఎంత దోహదపడతాయని పేర్కొన్నారు. ఇలాంటి ఉదార స్వభావంతో ఏర్పాటుచేసిన దాతల పేరు ప్రతిష్టలు నిలిపేందుకు గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ భానుప్రసాద్, ఎస్ఐ రామాంజనేయులు పేర్కొన్నారు. విద్యార్థులు గ్రంథాల యలలో ఉన్న పుస్తకాలను చదివి తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వారు పేర్కొన్నారు. ప్రతిరోజూ గ్రంథాలయాన సందర్శించి అందులో ఉన్న పోటీ పరీక్షలకు, దినపత్రికలు చదివి మేధోశక్తిని పెంచు కొనేందుకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రంథాలయం ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్క దాతకు తాము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్యారంపల్లి ప్రధానోపాధ్యాయులు సరస్వతి, అష్టావధాని లోక జగన్నాథ శాస్త్రి, విశ్రాంతి ఉపాధ్యాయులు వైవి.రమణ, లక్ష్మన్న, ఖాజాపీరు, వెంకటసుబ్బయ్య హరినాద్‌నాయు డు, భరతరాజా, లయన్స్‌క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, పోలీసుసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రామాపురం

వర్షాకాలంలో ప్రభలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సబ్ యూనిట్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాపించే మలేరియా, చికెన్ గున్యా, డెంగీ, వైర్ ఫీవర్లు రాకుండా దోమలను గుడ్డు లార్వా దశలోనే అంతం చేయాల న్నారు. ఇందుకోసం ప్రతి శుక్రవారం డ్రైడే ఫాగింగ్ చేయించాలన్నారు. ప్రతి సబ్ యూనిట్ అధికారి పరిధిలోని సచివాలయాల్లో పూర్తి వివరాలు ఉంచాలన్నారు. ప్రతివారం సచివాలయ పరిధిలో సమస్యలను సెక్టర్ కంట్రోల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు గ్రామాలలో ప్రబలిన జ్వరాలు నివారణకు చేపట్టిన నివారణ ప్రక్రియలను జిల్లా కేంద్రానికి నివేదికలు పంపాలన్నారు. జిల్లాకు నాలుగు ఫాగింగ్ యంత్రాలు మంజూరు చేశారని ఫాగింగ్ మిషన్ పని చేసే విధానంపై డెమో చేసిచూపించారు. జిల్లాకు నాలుగు ఫాగింగ్ మిషన్లు మంజూరైనట్లు చెప్పారు. వీటిని రాయచోటి రూరల్‌కు రాజంపేటకు కలికిరి సబ్ యూనిట్ కు పంపిణీ చేసిన తెలిపారు. ఒకటి జిల్లా హెడ్‌క్వార్టర్‌లో రిజర్వులో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సబ్‌యూనిట్ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఫాగింగ్ యంత్రాలను అందిస్తున్న రామచంద్రారెడ్డి

సిసి కెమెరా నిఘా నీడలో గ్రామ పంచాయతీలు

ఎస్ఐకు సిసి కెమెరాలను అందిస్తున్న వెంకటేశ్వరరావు, కుటుంబసభ్యులు

22 సిసి కెమెరాలు వితరణ చేసిన 'దగ్గుపాటి'

ప్రజాశక్తి-కలకడ

సిసి కెమెరాల నిఘా నీడలో గ్రామపంచాయతీలో ఉండాలన్న ఉద్దేశంతో 22 సిసి కెమెరాలను వితరణ చేసినట్లు టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మండల అధ్యక్షులు దగ్గుపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన కలకడ జడ్‌పి హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో 22 కెమెరాలను వితరణ చేసినట్లు తెలిపారు. తన సొంత డబ్బులు వెచ్చించి సుమారు రూ.3లక్షలు విలువ చేసే 22 కెమెరాలను వితరణ చేసినట్లు తెలిపారు.ఈ కెమెరాలు మండల కేంద్రమైన కలకడలోని జనసంచారం తిరితే ప్రాంతం, చోరీలు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలోని 16 సచివాలయ పరిధిలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. తన భార్య శారద, కుమారుడు పునీత్‌తో కలిసి కెమెరాలను స్థానిక ఎస్ఐ రామాంజనేయులు చేతుల మీదుగా వితరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి తిరుపతి నాయుడు, ఎంఇఒ మునీంద్ర నాయక్, లయన్స్ క్లబ్ సభ్యులు, హెడ్ కానిస్టేబుల్ రమేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, విశ్రాంతి ఉపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలను పరిశీలిస్తున్న డివైఇఒ లోకేశ్వర్‌రెడ్డి

పకడ్బందీగా 'పది' పరీక్షలు : డివైఇఒ

ప్రజాశక్తి- కలకడ

పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని మదనపల్లి డివైఇఒ లోకేశ్వర్ రెడ్డి పేర్కొ న్నారు. గురువారం మండలంలోని కోన కలకడ ఆదర్శపాఠశాలను పరిశీలించినట్లు తెలిపారు.ఈ కేంద్రాల్లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఉండవలసిన వసతుల గురించి ఆరా తీసినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షలు రాసేటప్పుడు వారికి కావలసిన సౌకర్యాలు గాలి ,వెలుతురు, నీరు, నీడ, కూర్చోవడానికి బల్లలు, విద్యుత్ సౌకర్యం ఉందా లేదా అన్న అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. 10వ తరగతి నిర్వహించే పరీక్షా కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల సహాయ ఉపసంచాలకులు శ్రీనివాసరాజు, ఎంఇఒలు మునీంద్ర నాయక్, రామచంద్రారెడ్డి, తదితరులు ప్రిన్సిపల్ గోవిందు, ప్రధానోపాధ్యాయులు, వెంకటసుబ్బయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పుల్లంపేట

ఎస్‌పి ఆదేశాల మేరకు యువత భవిష్యత్తు, భద్రత లక్ష్యంగా విద్యార్థులకు చట్టాలపై కల్పించినట్లు శక్తి టీమ్ సభ్యులు పేర్కొన్నారు. బాలికలు, మహిళలు రక్షణ కోసం శక్తి యాప్‌ను సెల్ ఫోన్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.శక్తి యాప్‌తోవిద్యార్థినులు, సాధారణ పౌరులు ఆపదలో ఉన్నప్పుడు తక్షణమే పోలీసు సహాయం పొందేందుకు ఉద్దేశించిన శక్తి యాప్' ఉపయోగించే విధానాన్ని, దాని ప్రయోజనాలను బృందాలు వివరించాయి. మైనర్లు వాహనాలు నడపడం తీవ్ర నేరమని శక్తి టీమ్ స్పష్టం చేసింది. మైనర్లకు వాహనం ఇచ్చిన తల్లిదండ్రులు లేదా వాహన యజ మానులపై కఠిన కేసులు నమోదు చేయడంతో పాటు, వారి డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేసేలా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల యువత జీవితాలు, ప్రవర్తన చెడిపోయే ప్రమాదాన్ని వివరించారు. ఈ విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని, సమాచారం ఇవ్వాలని కోరారు. బాలల భద్రతకు సంబంధించిన పోక్సో చట్టం, మహిళల పట్ల జరిగే నేరాలు, సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పించారు.ఎలాంటి ఆపద వచ్చినా భయపడకుండా, ధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. విద్యార్థులు చట్టాలపై, తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండటం అత్యవస రమని తెలిపారు. ఆపదలో ఉన్నప్పుడు సంప్రదించాల్సిన అత్యవసర టోల్ ఫ్రీ నంబర్ల సంప్రదించాల న్నారు. తక్షణ సహాయం (అన్ని అత్యవసర పరిస్థితులు) కోసం 112, సైబర్ నేరాలకు1930, మహిళా హెల్ప్‌లైన్, బాల్య వివాహాలు181, పిల్లల రక్షణకు1098, డ్రగ్స్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనులకు జలహారతి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని బి.యర్రగుడి గ్రామం వాటర్ షెడ్ ప్రాజెక్టులో జరిగిన రెండు వేల పనులను నియోజకవర్గ టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి జల హారతినిచ్చి పనులను జాతికి ప్రజలకు అంకితం చేశారు. వాటర్ షెడ్ వలన భూగర్భ జలాలు గణనీయంగా పెరగడంతో వాటర్ షెడ్ గ్రామాల రైతులు ఆనంద వ్యక్తం చేశారు. టిడిపి మండల ఇన్‌ఛార్జి మదన్ మోహన్ మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి మండలం చాలా వెనుకబడిన ప్రాంతమన్నారు. వాటర్ షెడ్ల నిర్మాణం వలన భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయం, పండ్ల తోట్ల పెంపకానికి ఉపయోగపడతాయన్నారు. రైతులు ప్రతి ఒక్క నీటిబొట్టును ఒడిసి పట్టుకోవాలని కోరారు. గ్రామాలలో మరిన్ని చెక్ డ్యామ్ లు నిర్మించేందుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి దృష్టికి వెళ్లి గ్రామాలలో నీటి నిల్వలు పెరిగేందుకు కృషి చేస్తామని తెలిపారు. మంత్రి సోదరులు ఇప్పటికే మండలంపై ప్రత్యేక దృష్టి సారించి వెలిగల్లు నుంచి ప్రతి గ్రామాని నీటిని వదిలి నీటి ఎద్దడి లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ వెంకటరత్నం, ఎపిడి లక్ష్మీ నరసయ్య, పిఒ వెంకట్రా మిరెడ్డి, జెఇ నరసింహారెడ్డి, పి.వెంకటరమణ, దామోదర్‌రెడ్డి, స్థానిక నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి జయరాం, మోహన్ రెడ్డి, సురేంద్రరాజు, లక్ష్మీరాజు, సర్పంచులు, వాటరషెడ్ చైర్మెన్లు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్‌కు జలహారతినిస్తున్న లక్ష్మి పసాద్ రెడ్డి

ఎంఇఒకు వినతిపత్రం అందిస్తున్న జాబిర్

జీతాల చెల్లింపుల్లో నిర్లక్ష్యం తగదు : యుటిఎఫ్

ప్రజాశక్తి-గాలివీడు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా డిఎస్‌సి ద్వారా ఎంపికై ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం వహించడం తగదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబిర్ పేర్కొన్నారు. గురువారం ఎంఇఒ1 శ్రీనివాసులు కు వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు సాంకేతికంగా వారికి ఐడి నెంబర్‌ను కేటాయించడం, వారి పత్రాలను అప్‌లోడ్ చేయడం, సర్వీసు పుస్తకాన్ని ప్రారంభించడం వంటి ప్రక్రియలు చేసిన తర్వాత వారు పనిచేసిన కాలానికి జీతం అందుతుందన్నారు. ఈ ప్రక్రియ మండల విద్యాశాఖ అధికారి వారి ద్వారా వారి సిబ్బంది నిర్వహించాల్సి ఉంటుందని కానీ గాలివీడు మండలంలో దాదాపు 36 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరగా ఇప్పటివరకు సగం మంది కూడా జీతాల చెల్లింపు ప్రక్రియ పూర్తి చేయలేకపోవడంతో ఆయా ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నట్లు వారు తెలిపారు. వెంటనే నూతన ఉపాధ్యాయుల జీతాలు చెల్లింపు ప్రక్రియను ప్రారంభించి సకాలంలో పూర్తి చేసి వారికి జీతాలు అందేటట్లు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో యుటియఫ్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉలవలు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సబ్సిడీ కింద 250 క్వింటాళ్ల ఉలవలు మంజులైనట్లు మండల వ్యవసాయ అధికారి నాగమణి తెలిపారు. స్థానిక మండలవ్యవసాయ అధికారి కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయుకు ప్రభుత్వం 80శాతం సబ్సిడీతో ఉలవలు 250 క్వింటాళ్లు మండలానికి మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. 10కేజీలు రూ.550లు, రైతు వాటా రూ.112 ప్రభుత్వ సబ్సిడీ, రూ.448 చెల్లించవలసి ఉంటుందన్నారు. ఉలవ పంట సాగు చేయదలసిన రైతులు గ్రామ పంచాయతీలోని రైతు సేవ కేంద్రాల వద్దకు ఆధార్‌కార్డు, భూమి పట్టాదారు పాస్‌బుక్ తీసుకెళ్లి రైతు వాట చెల్లించి ఉలవల ప్యాకెట్ తీసుకోవచ్చని చెప్పారు. ఉలవలను దుర్వినియోగం చేసుకోకుండా సాగు చేసి ఇ-క్రాప్ నమోదు చేయించుకొవాలన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.**చిన్నమండెం :** మండలానికి 200 క్వింటాల్ ఉలవలు మంజూరయ్యాయని వ్యవసాయ అధికారి గీత తెలిపారు. మండల పరిధిలోని రైతులు తమ గ్రామాలలోని రైతు సేవ కేంద్రంలో 10 కిలోల ఉలవల ప్యాకెట్‌కు రూ.112లు చెల్లించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉలవ పంట వేయదలచిన రైతులు ఉపయోగించుకోవాలని మండల పరిధిలోని రైతులకు సూచించారు. కేశపురం గ్రామ రైతులు బోన మల, చిన్నమండెం రైతు సేవా కేంద్రంలో 10న ఉలవల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభి స్తున్నట్లు తెలిపారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

- డిసిసిబి మాజీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

కార్యకర్తల సంక్షేమమే తమ ధ్యేయమని డిసిసిబి మాజీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్రగొల్ల రెడ్డయ్య యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని దేవళంపల్లిలో టిడిపి కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత కొత్త నాయకులను సమన్వ యం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి పాటుపడతామన్నారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి సహకారం అందిస్తున్నారని చెప్పారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మంత్రి చొరవతో అందరితో కలిసి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళదామని పేర్కొన్నారు. గ్రామంలో ప్రజా సమస్యలను గుర్తించి మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరి స్తామన్నారు. కార్యకర్తలను అందరిని కలుపుకొని రాబోయే స్థానిక సంస్థల ఎన్నిక ల్లో టిడిపి సత్తా మరోసారి చూపించేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఉమాపతి రెడ్డి, దిన్నెపాడు చెరువు నీటి సంఘం చైర్మన్ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి రాజేంద్రరెడ్డి, బిసి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ ఆసుపత్రి కమిటీ డైరెక్టర్లు భాస్కర్‌రెడ్డి, వెంకటరాజు, మైనారిటీ యువ నాయకుడు షేక్‌ఆరిఫ్, ఘోర ముక్తార్, సుధాకర్ యాదవ్, రామయ్య యాదవ్, పఠాన్ సాదుల్ల, యలమండ రవీంద్ర యాదవ్ పాల్గొన్నారు

మాట్లాడుతున్న పోలిరెడ్డి సుబ్బారెడ్డి

క్రైం కార్నర్

పేకాటరాయుళ్లకు జైలుశిక్ష

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతూ 2021లో పోలీసులకు పట్టుబడ్డ 11మంది పేకాట రాయుళ్లకు, తంబళ్లపల్లె జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఉమర్ ఫరూక్ గురువారం ఏడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. తంబళ్లపల్లె ఎస్ఐ ఉమామహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాలు..మండల పరిధిలో పలువురు పేకాట ఆడుతూ 2021లో పట్టుబడగా, వారిపై ఎపి గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అప్పటి ఎస్ఐ అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో పూర్వాపరాలను విచారించిన న్యాయమూర్తి గురువారం నిందితులపై నేరం రుజువు కావడంతో 11మంది ముద్దాయిలకు 7 రోజుల జైలు శిక్షతో పాటు రూ.300 జరిమాన విధించినట్లు తీర్పు చెప్పారని తెలిపారు. జరిమానా కట్టని పక్షంలో మరో 30 రోజులు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు.

శిక్షపడిన ముద్దాయిలతో పోలీసులు

ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ మృతి పోలీసుల కథనం మేరకు.. కలకడ మండలం, కదిరాయునిచెరువు పంచాయతీ, చెరువు ముందరపల్లికి చెందిన వెంకటరమణ, పద్మావతమ్మ(70) దంపతులు ఆస్పత్రిలో చికిత్స చేయించుకునేందుకు బుధవారం గుర్రంకొండకు ద్విచక్ర వాహనంలో బయల్దేరారు. మార్గమధ్యంలోని కృష్ణాపురం వద్ద వాహనానికి అడ్డుగా ఆవు రావడంతో అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దంపతులను స్థానికులు 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు దంపతులను ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తుండగా పద్మావతమ్మ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందింది. గుర్రంకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.